
# కూటసాక్షి

## బి.పి.కరుణాకర్

కథ

**గణపతి తాపీ మేస్త్రి. ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయి. ఎర్రగా, సన్నగా, పొడుగ్గా ఉంటాడు. మా సీనియర్‌కు అతను చాలా సంవత్సరాల నుండి తెలుసు. మా సీనియర్ ఇంట్లో ఏ పనినయినా గణపతే దగ్గిరుండి చేయిస్తుంటాడు. నాకు అతనిలో నచ్చే విషయం ఏమిటంటే అతని నవ్వు ముఖం. అతను కోపంగా ఉండడం నేనెప్పుడూ చూడలేదు. లోగడ అతనితో నేను ఎక్కువసార్లు మాట్లాడలేదు.**

అతని తల్లి వెంకాయమ్మ కేసు మా సీనియరు నాకు ఇచ్చి ఉండకపోతే అతనితో నా పరిచయం ఎక్కువ అయి ఉండేది కాదు. అయినా అతని గురించి అట్టే తెలుసుకోలేకపోయాను. అతని భార్య రమాదేవి చనిపోయే నాటికి ఆమె వయసు ముప్ఫయి సంవత్సరాలు. ఆమె గణపతివాళ్ల బంధువుల అమ్మాయే. అప్పటికి వాళ్ల పెళ్లి అయి అయిదు సంవత్సరాలవుతోంది. పెళ్లయిన సంవత్సరానికి ఒక బాబు పుట్టి, పుట్టిన మూడోరోజునే చనిపోయాడు. అతని తల్లి వెంకాయమ్మ ఎంతో ఇష్టపడి రమాదేవిని కోడలుగా తెచ్చుకుంది. వాళ్లిద్దరి మధ్య ఎటువంటి పొరపొచ్చాలు ఉండేవి కావు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. ఆమె బతికి ఉండగా ఏ సందర్భంలోనో మా సీనియరు దగ్గిరకు వచ్చినప్పుడు ఒకసారి చూశాను. మనిషి చాలా చక్కనిది. కాలిపోయిన తర్వాత ఫొటోల్లో చూశాను. భయంకరంగా ఉంది.



ఎంతో సవ్యంగా సంసారం సాగిపోతున్న సమయంలో రమాదేవి అగ్నికి ఆహుతి అయింది. తొంభయి శాతం కాలిపోయింది. మరణ వాఙ్మూలంలో "మా అత్త వెంకాయమ్మ నా మీద కిరసనాయిలు పోసి నిప్పంటించింది. నేను వంట గదిలోంచి బయటకు రాకుండా తలుపు మూసేసింది. నన్ను ఎంతో ప్రేమగా చూసుకునే ఆవిడ ఎందుకలా చేసిందో నాకు అర్థం కావడం లేదు. నాతో ఆమెకు విరోధం లేదు. మాటా మాటా కూడా ఎప్పుడూ అనుకోలేదు. నన్ను చంపేంత కక్ష ఎందుకు పెంచుకుందో నా ఊహకు అందడం లేదు..." స్పష్టంగా స్పృహలో ఉండే అంది. వాఙ్మూలం రికార్డ యింది. ఆరేడు గంటలు భయంకరమయిన బాధ అనుభవించిందని విన్నాను. చనిపోయేముందు ఏదో చెప్పడానికి ప్రయత్నం చేసింది కాని మాటలు పడిపోవడం వలన ఏమీ చెప్పలేకపోయింది. చేతులతో చేసిన సంజ్ఞలు ఎవరికీ అర్థం కాలేదని కూడా విన్నాను. వెంకాయమ్మను అరెస్టు చేసి జెయిల్లో పెట్టారు.

ఇటువంటి కేసులు సాధారణంగా మా సీనియరు తీసుకుంటాడు. ఆయనకు గణపతి బాగా తెలుసు కాబట్టి కేసు ఆయన తీసుకుంటాడని అనుకున్నాను. నాకు ఇవ్వడం ఇబ్బంది కలిగించిన మాట నిజం. మా సీనియరుతో వచ్చిన సమస్య ఏమిటంటే తను గెలవగలను అనుకున్న కేసులు తీసుకుని అనుమానపు కేసులు నాకు నెట్టేస్తుంటాడు. నాకు దొరికేవాళ్లు ఒహపట్టాన డబ్బులివ్వరు. కేసు నాకు అప్పగించడం గణపతికి కూడా నచ్చలేదు. ఆ మాట ఏ మొహమాటం లేకుండా నాతోనే అన్నాడు.

కేసు మొదలయింది. ప్రాసిక్యూషన్ పటిష్టంగా మరణ వాఙ్మూలం ఇనప కోటలా ఉంది. ఛేదించడం నా వలన కాదని గ్రహించాను.

వెంకాయమ్మకు యాభయి అయిదు సంవత్సరాలుంటాయి. ఆమెతో ఆరేడుసార్లు మాట్లాడాను. దుఃఖం తప్ప నాకు ఆమె నుండి ఎటువంటి సమాధానం సరిగా రాలేదు. ఎందుకో నాకు అర్థం కాలేదు. ఆమె నాకు కొద్దిగా సహకరించి ఉన్నా నాకు ఎంతో సహాయంగా ఉండేది. ఆమెకు గణపతి ఒక్కడే కొడుకు. భర్త చనిపోయి పదేళ్లు పయిగా అయింది. ఆమె గత నాలుగు సంవత్సరాల నుండి చక్కెర వ్యాధితో బాధపడుతోంది. దానికితోడు హృద్రోగి. బ్లాకులున్నాయి, స్టెంటు పెట్టాలని డాక్టర్లు సూచించారు. పెట్టించుకోలేదు కాని ఉపశమనం కోసం మందులు వాడుతోంది. మందులకు బాగానే ఖర్చవుతోంది. ఆమె తన పేరన ఉన్న డాబాను కొడుకు పేరన అతనికి



పెళ్లయిన కొత్తలోనే రాసిచ్చేసింది. తనకున్న బంగారమంతా కోడలికి ఇచ్చేసింది. ఆ తర్వాత అదంతా ఏమయిందో, ఎక్కడుందో ఆమెకు తెలియదు. ఆ విషయం గణపతిని అడగాలని నాకు అనిపించలేదు.

నా మటుకు నాకు వెంకాయమ్మ రమాదేవిని చంపవలసిన కారణం ఏమీ కనిపించలేదు. ఆ పని ఆమె చేయలేదు. చేయవలసిన అవసరం లేదు. ఆమె ఇంటి చుట్టుపక్కల వాళ్లను అడిగినప్పుడు ఆమె గురించి మంచిగానే చెప్పారు. కొడుక్కి సంతానం లేదని బాధపడేది కాని ఆ విషయంలో కోడల్ని సూటిపోటి మాటలు నవ్వులాటగానయినా అనేది కాదు. ఎవరయినా అడిగితే, "ఇంకా వయసుంది కదర్రా, తొందరేమిటి?" అంటూ కోడల్ని సమర్థించేది. కాకపోతే కొడుక్కు ఏమి కావాలో కోడలుకన్నా రెండడుగులు ముందుగానే అందించేది. అదే ఆమె చేసిన పొరపాటేమో! ఆ విషయం నేను సీరియస్‌గా తీసుకోలేదు.

ప్రాసిక్యూషన్ పట్టు ఆమె చుట్టూ అల్లుకుంటోంది. రమాదేవి కాలిపోయిన రోజున కేన్ నిండా అయిదు లీటర్ల కిరసనాయిలు కొన్నట్టు రుజువు ఉంది. ఆ కిరసనాయిలుతోనే దహన కాండ జరిగింది. పోలీసులు తీసుకువచ్చిన సాక్షి రమాదేవి గదిలో కాలిపోతుంటే వెంకాయమ్మ తలుపు మూసి గడియపెట్టడం చూశానని కోర్టులో చెప్పాడు. పోలీసులు మంచి సాక్ష్యాలనే సంపాయించారు. అందరినీ మించి గణపతి చిన్నాన్న సాక్ష్యం బలంగా ఉంది. అత్తాకోడళ్లు రోజుకు రెండు మూడుసార్లయినా పోట్లాడుకునేవాళ్లనీ, వెంకాయమ్మ రమాదేవిని మానసికంగా సతాయించేదని రమాదేవి బతికి ఉండగా

**పోలీసులు వెంకాయమ్మను బయటకు తీసుకు వచ్చినప్పుడు కోర్టు ఆవరణలో ఆమెను కలిశాను. ఏ ఆవేశాలకు లోను కాకుండా మామూలుగా ఉంది. బేడీలు ఉన్న ఆమె చేతుల మీద నా చేయి వేసి నిమురుతూ ఉంటే, "జన్మఖైదు అంటే ఏమిటి?" నెమ్మదిగా అడిగింది. అది కూడా తెలియని అమాయకురాలికి వివరించబోయాను కాని గొంతు పెగిలి వెంటనే మాట రాలేదు.**

ఏడుస్తూ చాలాసార్లు తనతో చెప్పిందని చెప్పాడు. గమ్మత్తేమిటంటే అతను వెంకాయమ్మకు యాభయి వేల వరకు బాకీ ఉన్నట్టు తెలిసింది. ఆ బాకీ తాలూకు రాతకోతలేమీ లేవు. అది కాకుండా వంట గదికి వెనకతట్టు మరో తలుపు ఉంది.

గణపతి నలుగురు దొంగ సాక్షులను నా దగ్గిరకు తీసుకువచ్చి, "వీళ్లు మా అమ్మ తరుపు సాక్షులుగా ఉంటారు" అన్నాడు.

ప్రయత్నించి చూద్దామని అనిపించింది. "వాళ్లు సాక్ష్యం చెప్పడానికి ఏమయినా ఇవ్వాలి కదా?" అన్నాడు. వాళ్లు అతనింటి చుట్టుపక్కల వాళ్లు కాదు. చుట్టుపక్కలవాళ్లు సాక్ష్యం చెప్పడానికి ఒక్కరయినా ముందుకు రాలేదు.

"ఇవ్వద్దూ మరి?" అన్నాను.

"మీరే సర్దండి" నవ్వుతూ అన్నా మొండిగా అన్నట్లు అనిపించింది.

"నేనెందుకు ఇవ్వాలో ఒక్క కారణం చెప్పు".

"కేసు మీరు వాదిస్తున్నారు కదా?"

"ఇది హత్యానేరం కేసయ్యా. పోనీ ఒక్క మాట చెప్పు. ఇప్పటి వరకు నాకు ఎంత ఇచ్చావు?"

"అయిదువేల రెండొందలు. తక్కువే. ఒప్పుకుంటాను. కేసు అయిపోగానే మిగిలింది ఇస్తాను."

కేసు గెలిచినా, ఓడినా వీళ్లు మాకు కనబడరు. గణపతిలాటి వాళ్లను చాలామందిని చూశాను.

"మీ అమ్మ బయటకు రావడం నీకు ఇష్టం లేదా?"

"ఎందుకు లేదు సార్? ఉంది. ప్రస్తుతానికి నా దగ్గిర ఏమీ లేదు. సాక్షులకు మటుకు నేనే ఎంతో కొంత ఇచ్చుకుంటాను" అన్నాడు.

గణపతికి తాపీ మేస్త్రీగా మంచి పేరే ఉంది. సంపాదన తక్కువేం ఉండదు. డబ్బు దగ్గిర ఎందుకు వెనకాడుతున్నాడో నాకు అర్థం కాలేదు. నాకు అతని డబ్బు కాదు ముఖ్యం. ఏదో విధంగా వెంకాయమ్మను రక్షించాలనే తపన ఉంది. రమాదేవి కాలిపోతున్న సమయంలో ఆమె అక్కడ లేదని విశ్వసిస్తున్నాను. నా ప్రయత్నం నేను చేస్తున్నాను.

కేసు నడుస్తుండగా గణపతి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. కట్నం బాగా తీసుకున్నాడని విన్నాను. పెళ్లికి మా సీనియరును పిలిచాడు. ఆయన వెళ్లలేదు. నన్ను పిలవలేదు. పెళ్లయిన తర్వాతగాని ఆ విషయం వెంకాయమ్మకు తెలియలేదు.

మా తరుపు సాక్షులు బాగా చెప్పినా చివరి సాక్షిగా వచ్చిన గణపతి మటుకు, "మా అమ్మ నా మొదటి భార్య రమాదేవి మీద కిరసనాయిలు పోసి అగ్గిపుల్ల వెలిగించడం నా కళ్లారా చూశాను" అన్నాడు. కేసులోంచి తల్లిని తప్పిద్దామని ఎంతో తాపత్రయపడిన వాడు కోర్టులో అలా చెప్పేసరికి సగం చచ్చిపోయాను. నా తరపు మనిషే కోర్టులో అలా చెప్పేసరికి నాకేం చేయాలో తోచలేదు. బొత్తిగా నేనూహించని విషయం. న్యాయమూర్తే నమ్మలేనట్లు గణపతిని మరోసారి అడిగితే అదే జవాబు చెప్పినప్పుడు "నువ్వెందుకు అడ్డుకోలేదు?" అడిగాడు. గణపతి జవాబు చెప్పలేదు. వెంకాయమ్మ మీద ఉచ్చు బిగుసుకుపోయింది. జన్మఖైదు విధించారు.

ఈ కేసులో నాకు వచ్చిన అనేక సందేహాలకు ఎక్కడి నుండీ సమాధానాలు దొరకలేదు. రమాదేవి చనిపోడానికి కారణాలు తెలుసుకోడానికి నేనెంత కష్టపడినా లాభం లేకపోయింది. కారణాలు ఏవయినా ఉండుంటే అవి వెంకాయమ్మకు తెలిసి ఉండాలి. నేను ఎన్నిసార్లు అడిగినా తనకు తెలియదనే అంది.

తీర్పు చెప్పిన వెంటనే గణపతి కోసం వెతికాను. కనబడలేదు. పోలీసులు వెంకాయమ్మను బయటకు తీసుకు వచ్చినప్పుడు కోర్టు ఆవరణలో ఆమెను కలిశాను. ఏ ఆవేశాలకు లోను కాకుండా మామూలుగా ఉంది. బేడీలు ఉన్న ఆమె చేతుల మీద నా చేయి వేసి నిమురుతూ ఉంటే, "జన్మఖైదు అంటే ఏమిటి?" నెమ్మదిగా అడిగింది. అది కూడా తెలియని అమాయకురాలికి వివరించబోయాను కాని గొంతు పెగిలి వెంటనే మాట రాలేదు. నా ముఖంలోకి చూస్తూ "ఏదయితేనేం... పోనీ... ఈ మాట చెప్పు. నా గుండెజబ్బుకూ చక్కెర వ్యాధికి మందులు కావాలంటే నేనేం చేయాలి?" అడిగింది. వయసుతో పెరుగుతున్న అనారోగ్యానికి ఏమాత్రం ఖర్చు పెట్టడం ఇష్టం లేకనో, కొత్త భార్య అందుకు ఒప్పుకుంటుందో లేదో అని గణపతి తల్లికి ప్రతికూలంగా సాక్ష్యం చెప్పాడా? ఏమో!